కథానిక:

# అడవి ప్రేమ

★

శ్రీ కవికొండల వేంకటరావు

ఆ క్రితంరాత్రి రెండోజాముదాకా ప్రజ్వరిల్లి, కొండలనుండి, పార్శ్వమందలి పల్లెటిపట్టుకు, కాంతిగోల్పిన దవానలజ్వాలలు, అనుకోని ఝుంఝా మారుతానికిజవజవలాడి, చలిచలిరేగి, చప్పున చల్లారి వూరుకున్నాయి, పెద్ద కుంభవృష్టిగా కురిసిన ఒకానొకతొలకరి వానకు.

ఆ రాత్రి రెండోజామునుండి చీకటిగుయ్యారం సమస్తం, కారుమబ్బులు మెఱిసే మెఱుపు తప్పిస్తే! సమస్తం, నీరవనిస్సహాయం, ప్రతిధ్వనించే ఉఱుము తప్పిస్తే! భూమిమీది జీవకళనంతా, భూమిమీది తేజస్సునంతా, భూమిమీది సారమునంతా, పైకి చివ్వన లాగికొని, మోసికొని, పీల్చికొని, పైనుండి పటాపంచలుగా పంచుకున్నట్టు పీటమీట లిట్టిట్టే వేసి తీస్తూవున్నట్టు, చిమ్మట కొట్టినట్టు, కాదంబినీ మాల ఆరేయి విజృంభించి ఒక్కధారగా ప్రవర్షించింది పక్కా ఝూం!

తెఱిపి యిచ్చిన మూడోజామునందలి మొదటి ముహూర్తభాగం కూడా, ఆకాశమందు, కఱి కఱి మొయిళ్లే ఆవరించుకొని వున్నాయి; కాసంత చుక్క వెలుగు గాని, కంజాతకలికపు తిప్ప గాని వెలిసింది లేదు.

ఆ కొండల్లో కెల్లా విశ్రుతి కెక్కిన కొండ "ఊటకొండ." దాని ప్రక్క నున్న కోయకుప్పం "ధారాపల్లి". వెదురుకంచెలు కోటగోడల్లా వినిర్మించుకొని, ఊటకొండచాటుచలువనే పదిపదేను కంప కొంపలలో, ఆయువుకు అంజలి వొగ్గుతూ, అస్తమానం ఆ చుట్టుపట్ల అడవినే మసలుతూ, రాత్రి పడేటప్పటికి, గూళ్లకు పక్షుల్లా అవభిజ్ఞులు తమతమ తావులకు చేరుకొని, గుండెలమీద చేతులు వేసికొని నిర్భీతిగా నిదురించడం రివాజు.

పెళ్లికాని కోయపడుచులు, కోయయువకులు' ఉబుసుపోకకైతేనేమి, ఉండబట్టలేక అయితేనేమి' పోకు కబుర్లు రహోవ్యథలు, 'సుబ్బ'కుంటూ, మంచెల మీదకెక్కి, మంచాలక్రింద నక్కి, అన్యోన్యం చీకటి చాటు ప్రగల్భాల ప్రవర్తిస్తూ వుండడం, ఆ పల్లె కదో నిండు.

అయితే నాటి రాత్రి మెఱుపుతేటుకు జంకి "బొఱ్ఱదొర," "దుమ్మలమ్మ", ఇరువురు - ఆ యూరిలో తమ అవివాహిత యౌవన శ్రీ వికాసాన్ని వెల్లడికానీయకుండా, వెఱ్ఱిఆకాశాన్ని ఒకసారి, మఱి రాకాసుల్ని ఒకసారి చూస్తూ - కళ్లు చీకట్లు కమ్మి పిడుగుచప్పళ్ల చెవులు గళ్లడిపోతూవుంటే, కదల తావు లేక; ఒకరి నొకరు వదల చేవలేక, పరిబంధితులైనట్టు, ఆ పల్లెటిపట్టునే ఒక పంచ నిల్చుండి పోయినారు, అంత వనలోను, అంత గాలిలోను!

అలా వాన వెలిసింది, ఇలా గాలి కగిరిపడ్డట్టు ఒక మగపులి, దాని వెనకనే ఒక ఆడపులి, వాళ్ల కాళ్ల దగ్గఱ కురికాయి! అవి వాటి గ్రుడ్లతో ఒకదానిమీద

కొకటి చింతనిప్పులు చెరుక్కుంటూ, గాండ్రు గాండ్రుమని ఒకప్పుడు ఎదురెదురుగాను, ఒకప్పుడొకదానితోక నొకటి కరచుకొంటూను – "ఆండ్రింపు" అనుకోడానికి వీల్లేకుండా, ఆహవకేళి అనుకోడానికి కల్లకాకుండా—నిచ్చలవిడిగా "ధారాపల్లి" ఊరులో పడి భీభత్సం గొలుపసాగాయి. ఊళ్లోవాళ్లందఱూ, వాన వెలిసిపోయిందన్న విరామం సుతరాం లేకుండా తమతమ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకు గుడ్డలు గుడిసెలు విడిచిపెట్టి, వెదురుబిడెపు పుంతలంట, ఎడాపెడా బలిసిన పొదలంట, పారిపోజొచ్చారు. కొళ్లు కొయ్యలెక్కి కొండలెక్కి వేళకాకుండానే కొక్కొరోకో మంటూ చెల్లాచెదరై పోయాయి. కుక్కలు బొంయిబొంయిమని ఆ పెద్దపుళ్లమీద కురికిన ట్టురికి అమాంతంగా వాటియొక్క పంజా ఆహతముకు ఆహుతి అయినాయి.

తూర్పురేఖలు ఉదయగిరి చీల్చుకు అగ్నిపర్వతపు జ్యోతిలా మారే తొలిసంధ్యకు, ఊళ్లో, ఒక్క పులుగుగాని, ఒక్క పురుగుగాని లేదు. మనుష్యులు మటుమాయమైనారు.

ఒకపులి, మనుష్యమాంసం రుచిమరిగితే పట్టశక్యంగానిది, రెండుపుళ్లు ఊరిమీది కురికినాయి అంటే, జనంకోయవాళ్లే కానియ్యండి,కొండవాళ్లే కానియ్యండి; అడ్డుకోవడం అనేది ప్రాణగొడ్డంలాంటిపని.

అవితే – మనుష్యులేమన్నా తమర్ని తినడానికి ఆ పెద్దపుళ్లు ఆ రాత్రి ఊరిమీద పడ్డాయి అని అనుకున్నారే కాని—నిజంగా ఆ మువ్వన్నె మెకాలకా ఊహలేదు. అవి అన్యోన్యం అలింగనం అపేక్షించుకునో, లేకఅసహ్యం వహించుకునో ఆలా తికమకపడుతూ తమ కళ్లు తామెఱుగక ఒళ్లమీద కా వేళప్పుడుపడ్డాయి. పడి తెల్లారింది కూడా తెలియనివై, అలాగేఆ రెండు పులులూ ఒక దానితో ఒకటి కలబడుతూ, కొట్టుకుంటూ, ధారాపల్లి పొలిమేర దాటకుండా ధూకుడు కొబలిచాయి.

బొఱ్ఱదొర తిన్నగా ఒక తాటిచెట్టుఎక్కిపోయినాడు, ఊరావల కొకమైలు పరుగెత్తి. వాని వెనకాలే దుమ్ములమ్మ తురంగలించి, తొంగలి ఱెప్పలు పైకెత్తుకు, ఈ తాటిచెట్టునే కావులించుకు, పైకెక్కలేక "ఒరే! ఏలారా" అని అడుగుతోంది. వెన్నమీద మగ పెద్దపులో ఆడపెద్దపులో అంగలో చఱిచేస్తుంది అనేదే, ఆ కోయపిల్ల ఫికరు.

అంతలో నుద్ద దద్దళం బెల్లువిరిగి, నేలనుపడితే ఎంత చప్పుడౌతుందో అంత విడ్డూరపు చప్పుడు అయింది !

బొఱ్ఱదొర తాటిమువ్వలో కూర్చొని, దూరంగా ధారాపల్లివంకకుచూస్తూ "దుమ్ములూ! మహా గుమ్మైన గుద్దు గుద్దేసింది ఆడపులీ, మగపులిముఖం మీద. మగవులి చచ్చి వూరుకుంది. అదిగో! ఆడపులి ! ఆడపులి ! ఱెక్కలు కట్టుకున్న లేడికంటె వడిగా కీకారణ్యంలోకి వెళ్లిపోయింది ! చచ్చిన మగపులి మొగాన్ని ఆడపులి పీకిపారేసిన గ్రుడ్లు, ఊడబుచ్చిన గోళ్లు, అవీ, మన ఊళ్లోవాళ్లు గుమిగూడి చూసూ, రిచ్చపోతూవున్నారు. నీవు మఱి తప్పుకో! నేను తాటిచెట్టు దిగాలి " అన్నాడు.

దుమ్ములమ్మ అనే ఆ యెమ్మెలాడి, "నాను తప్పుకోడ మెందుకురా,బొఱ్ఱనాయుఁడూ, దిగిరా! అలాగవితే! నా బుజాలొడ్డేని, నీ పాదాలకు" అంది. "నీవు కూడా నన్ను ఆ ఆడపులి మగపులిని వెంటాడించినట్టు ఈపైనుంచి వెంటాడించి చంపేస్తావేమో!" నని అన్నాడు బొఱ్ఱదొర అన్న ఆ కుఱ్ఱడు.

దుమ్ములమ్మ అంది. "ఓరేవ్! మాంవా! మృగాలన్నవి ప్రేమించుకోవడం అంటే ఒకదాన్నొకటి చంపుకోవడం అన్నమాట! మనం నరమానవులం! ఒకళ్లనొకళ్లం బతికించుకుంటాం మన ప్రేమచేత. రారా! దిగరా! నేను చచ్చినా ఫరవాలేదని నన్ను విడిచిపుచ్చి నీవు తురతుర తాటితుద కెక్కిపోయి, నావంక మఱి సూసినావు కాదు కాని, నా చూపులన్నీ నీవొంకకే తిరిగి వున్నాయి, యీదాకాను." అంది. ఇలా బొఱ్ఱదొరతో ఉబుసాడుతూనే వుండ, దుమ్ములమ్మ! మట్ట మధ్యాహ్నం అయింది. మొవ్వనీడలు చెట్టుమొదళ్ల ముసిలమ్మల్లా కూర్చొని వున్నాయి.

ఒక ఎలుగుబంటి అమాంతంగా నడిచివస్తూ, దుమ్మలమ్మ కావలించుకున్న చెట్టునే రెండో ప్రక్క గమ్మున కావలించుకు పైకి మువ్వలోకి చూపులు చూడసాగింది. దుమ్మలమ్మకు తొల్త ఆ సంగతి తెలిసింది కాదు. తన రోకుతో మోకల్లుకు తాడిచెట్టు ఎక్కేసి బొజ్జకొరతో సరిసమానంగా మువ్వలో కూర్చుందాం అనే ఆశయంలో మునిగివుంది, అతగాడు పైనుండి దిగకపోతే!

భల్లూకం చెట్టును కావులించుకున్న దూరుకోక గోళ్ళతో గీరసాగింది. తాటిచెట్టుచర్మం గలగలా మంది. అది విని దుమ్మలమ్మ సన్న తెలిసి సాహసించి ఆ ఎలుగ్గొడ్డుయొక్క రెండుచేతులూ లాగిపట్టి "ఒరేవ్! దొరా! ఎలుగ్గొడ్డు నీవంక చూస్తూవుంది!" అంది నవ్వుతూ. "చచ్చాను." అని కేకేశాడు బొజ్జకొర. "ఫరవాలేదు అలాగే వుండు నీవు మువ్వలో" అంటూ, తాను ఆ ఎలుగ్గొడ్డుయొక్క రెండుకాళ్ళయొక్క పాదాలమీద తన పాదాలు పెట్టి అణచి దానిచేతుల్ని, అలా, అటొకటి, ఇటొకటి, తన చేతులతో ముందుకువూచి, ఆ అపరజాంబవంతుని బొరకు తాళవృక్షం రాచుకుపోయేలా- చూడండి! గునపం పాతి గెడ చీల్చే పద్ధతిని - గుంజి గుంజి, గుంజి, గుంజి రాపాడించింది. ఆ రాపాడింపుతో చెట్టుచెట్టు, ధరణి గ్రక్కదల, తలాడింపసాగింది. ఆడింపు కాడింపుకూ, ఎలుగుబంటి చావు అరపులు అరవసాగింది. దాని బొరమీది వెంట్రుకలేకాకుండా, లోపలి తోలు, తోలు క్రింది కండ, కండలో గుండెకాయ, పఱపఱ తెగి, నెత్తురు వఱద అయిపోయింది.

దుమ్మలమ్మ "ఇప్పుడన్నా దిగి వస్తావా? మరో ఎలుగ్గొడ్డును పిలవనా?" అంది బొజ్జదొరకేసి--బొజ్జదొర మీద నున్న నీలనీల ఆకాశంకేసి—చూస్తూ.

బొజ్జదొర కిందకు దిగుతూ "నివ్వే? ఈ ఏలుగ్గొడ్డును చంపింది?" అని అడిగాడు. "నేనేగాని నేనంటే నీకెందుకురా అంతభయం!" అని దుమ్మలమ్మ బొజ్జదొరను, తన ఎదురొమ్ము నిండుగుండ్రందనాల చక్కందనాన్నే గగుర్పొడిచియున్న సూదివాడి చూచుకాగ్రాలతో కుర్రతనంకొద్ది అదిమి పట్టి బిగియార గుచ్చుకొన్నదై "ఎలుగొడ్డుకు ప్రాణం గుండెకాయ నంటిపెట్టుకొని వుంటుంది, దొరా! నాకంటి ఆడదానికి ప్రేమ గుండెకాయ నంటిపెట్టుకు వుంటుంది దొరా!" అంది. అంటూ గతరాత్రి మబ్బుకంటె ముమ్మరంగా ముద్దులు కురిపించింది.

బొజ్జదొర ఒక నిమేషం ఉక్కిరిబిక్కిరై, ఎట్టకేలకు "ఉండు. సర్దుకోనియి. అలాగా?" అని అన్నాడు మందహాసంతో మెఱసి!.

